క్లుప్తంగా

కులగణనపై శిక్షణ

ఉండి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన కార్యక్రమం మండలంలో శుక్రవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.రవీంద్ర తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ అధికారులకు కులగణనపై శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఈనెల 19వ తేదీ శుక్రవారం నుంచి 28వ తేదీ వరకు 10 రోజుల పాటు మండలంలో ఇంటింటికీ అధికారులు వెళ్ళి కులగణన కార్యక్రమాన్ని చేపడతారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, ఈవోపీఆర్డీ కె.కొండలరావు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యకు ఆహ్వానం


గరికిముక్కు సుబ్బయ్య

భీమవరం: అయోధ్య శ్రీరామ జన్మభూమిలో ఈనెల 21,22,23 తేదీల్లో నిర్వహిస్తున్న నూతన రామ మందిరంలో విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొనాలని భీమవరం పట్టణానికి చెందిన ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గరికిముక్కు సుబ్బయ్యకు ఆహ్వానం అందింది. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు నుంచి అందిన ఆహ్వానంలో నగర శైలిలో అయోధ్య రామ మందిరం నిర్మాణం జరిగిందని, ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ జరుగుతున్నందున కార్యక్రమంలో పాల్గొనాలని ఆహ్వానం అందినట్లు ఆయన పేర్కొన్నారు.

కోడి పందేల నిర్వహణపై 31 కేసులు

వీరవాసరం: మండల వ్యాప్తంగా కోడి పందేలు, పేకాటలపై దాడులు చేసి 31 కేసులు నమోదు చేసినట్లు వీరవాసరం ఎస్సై పి.రమేష్ గురువారం తెలిపారు. వీరవాసరం, రాయకుదురు, జొన్నలపాలెం, నవుడూరు, అండలూరు, మత్స్యపురిపాలెం తదితర గ్రామాల్లో కోడి పందేలు, పేకాట నిర్వహిస్తున్న వారిపై దాడులు చేసి 31 కేసులను నమోదు చేసినట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.1,03,850 నగదును సీజ్ చేసినట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని ఎస్సై చెప్పారు.

ఆకట్టుకున్న మాయాబజార్ నాటకం

భీమవరం (ప్రకాశం చౌక్): శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి ఆలయ 60 వార్షికోత్సవ మహోత్సవంలో భాగంగా గురువారం రాత్రి అమ్మవారి దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన విజయదుర్గా నాట్య మండలి పీవీ దుర్గాప్రసాద్ సమర్పించిన మాయాబజార్ నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. అలాగే ముందుగా ప్రదర్శించిన భక్తి సంకీర్తన, హరికథ, మ్యాజిక్ షో కూడా ప్రేక్షలను అలరించాయి. జనం పెద్ద సంఖ్యలు తరలివచ్చి కళా ప్రదర్శనలను తిలకించారు. కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు నీరుల్లి, కూరగాయ, పండ్ల వర్తక సంఘం ప్రతినిధులు, అమ్మవారు ఉత్సవ కమిటీ ప్రతినిధులు, దేవస్థానం అధికారులు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన పీవీఎల్


పాపారావును పరామర్శిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

పాలకోడేరు: గొరగనమూడి గ్రామ మాజీ సర్పంచ్ చెల్లబోయిన పాపారావును గురువారం డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు పరామర్శించారు. ఇటీవల పాపారావు మోకాలుకు శస్త్ర చికిత్స చేయించుకున్న నేపథ్యంలో ఆయన ఇంటికి వెళ్ళి క్షేమ సమాచారం అడిగి తెలుసుకున్నారు. పీవీఎల్ వెంట ఎంపీపీ అధ్యక్షుడు భూపతిరాజు చంటిరాజు, విస్సాకోడేరు సర్పంచ్ బొల్లా శ్రీనివాస్, పంపన రామకృష్ణ తదితరులు ఉన్నారు.

వేగంగా భీమవరం పట్టణాభివృద్ధి

రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్


భీమవరం 29వ వార్డులో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం పట్టణాన్ని వేగవంతంగా అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తెలిపారు. గురువారం స్థానిక 29వ వార్డులో రూ.1.72 కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ముందుగా రూ.76 లక్షలు, రూ.31.50 లక్షలతో సంజీవయ్య నగర్ కెనాల్ రోడ్డు వెంబడి నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను, అలాగే రూ.66.20 లక్షలతో ప్రకాష్ నగర్‌లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ అమృత్ పైపులైన్‌ను వంద పడకల ఏరియా ఆసుపత్రి వరకు కూడా పొడిగించినట్లు చెప్పారు. భీమవరం నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నానని, యనమదుర్రు డ్రెయిన్‌పై నిర్మించిన వంతెనలకు అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి సంబంధించి రూ.36 కోట్ల నిధులను మంజూరు చేయించడంతో పాటు టెండర్ ప్రక్రియ కూడా జరుగుతుందన్నారు. వచ్చేనెల రెండో తేదీ వరకు టెండర్ ప్రక్రియ ఉంటుందన్నారు. భీమవరంలో 100 పడకల ఆస్పత్రి ఉండాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఏరియా ఆస్పత్రి భవనం వద్ద స్థలం లేకపోవడంతో తాను నాలుగు ఎకరాల భూమిని ఇవ్వడం, ప్రభుత్వం రూ.10 కోట్ల నిధులు మంజూరు చేయడంతో 100 పడకల ఆస్పత్రి నిర్మాణం ప్రారంభించగా, 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి సంబంధించి నూతనంగా రూ.26 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. ఈ నిధులకు సంబంధించి టెండర్ ప్రక్రియ జరుగుతుందన్నారు. అవగాహన లేని కొంతమంది వాస్తవాలను తెలుసుకోకుండా మాట్లాడుతున్నారన్నారు. తాను నాడు నేడు కూడా భీమవరం అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నానన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, మేడిది జాన్సన్, గాదిరాజు సుబ్రహ్మణ్యరాజు, కామన నాగేశ్వరరావు, ఏఎస్.రాజు, పిప్పళ్ళ నాని, ఎలకల ధర్మారావు, నాగిడి జయలక్ష్మి, కొప్పర్తి వీర రాఘవులు, చిన్నమిల్లి వెంకటరాయుడు, వంకా చందు, తలారి హనుమంతరావు, ఉయ్యూరి వెంకన్న, ముద్దే రామభద్ర గౌడ్, ముత్యాలబుజ్జి, గంటా సుందర్‌కుమార్, కొట్టి కుటుంబరావు, పాలపర్తి జోనా, కందిగట్ల ఎడ్వర్డ్, చెల్లబోయిన సూర్యప్రకాష్, నడింపల్లి అశోక్ వర్మ, గాదిరాజు రామరాజు, నందమూరి ఆంజనేయులు, తాళ్లూరు చంటి, కోయ శ్రీరామమూర్తి, పూజారి రంగరాజు, యడ్ల పుష్ప, ముత్యాల రామారావు, ఉయ్యూరు శ్రీనివాస్ తదితర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమవరం అర్బన్: మండలంలోని గొల్లవానితిప్ప ఉప కేంద్రం పరిధిలో శుక్రవారం 11 కేవీ విద్యుత్ లైన్‌లపై చెట్ల కొమ్మలు తొలగింపు, వార్షిక మరమ్మతులు నిమిత్తం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్ అహ్మద్ ఖాన్ గురువారం తెలిపారు. గొల్లవానితిప్ప, ఎల్‌వీఎస్ పురం, సీఏడీ కంపెనీ, పల్లిపాలెం, ఈలంపూడి గ్రామాలకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్‌పై అవగాహన అవసరం


భీమవరంలో పెన్షనర్లకు కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

భీమవరం: ప్రభుత్వం పెన్షనర్లకు జీవన ధృవీకరణ పత్రాలు (లైఫ్ సర్టిఫికెట్) సమర్పణపై అవగాహన కల్పించాలని భీమవరం ఎస్‌టీవో అల్లూరి రవివర్మ అన్నారు. భీమవరంలో పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన గురువారం ఏర్పాటు చేసిన పెన్షనర్స్ జీవన ధృవీకరణ పత్రాలపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈనెల 29వ తేదీలోగా ధృవీకరణ పత్రాలను అందించాలని, దీనికి సంబంధించిన సర్టిఫికెట్స్ సబ్ ట్రెజరరీ కార్యాలయంలో లేదా ఇంటర్ నెట్ ద్వారా పొందవచ్చునన్నారు. అనంతరం పెన్షనర్స్‌కు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.జేమ్స్, కన్వీనర్ చెరుకువాడ రంగసాయి తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ


పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలో వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన గురువారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కన్వీనర్ ఎండీ మున్వర్ మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవని పార్టీ కార్యక్రమాల్లో భాగంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో రోడ్ల పక్కన జీవనం సాగించే పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాబ్జి, తాహీర్, ఖలీల్ అహ్మద్, మక్బూల్, సుబ్బయ్య, హనుమంతు, ఆదినారాయణ, న్యూటన్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలు ప్రారంభం

వీరవాసరం: 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి క్రీడా పోటీలు వీరవాసరం ఎమ్మార్కే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రాయకుదురు, కొణితివాడ జెడ్పీ హైస్కూల్లో గురువారం ప్రారంభమయ్యాయి. గ్రామ సచివాలయ పరిధిలో విజేతలైన క్రీడాకారులకు క్రికెట్, ఖోఖో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి బి.సుజాత రాణి మాట్లాడుతూ జగనన్న 'ఆడుదాం ఆంధ్ర' పోటీలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసి ఆణిముత్యాలను తయారు చేయడమే ఈ క్రీడా పోటీల ముఖ్య ఉద్దేశ్యం అని ఆమె వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.జ్యోతి, గ్రామ సర్పంచ్ చికిలే మంగతాయారు, గెద్దం భారతి, బీశెట్టి లక్ష్మి, ఏఎంసీ డైరెక్టర్ మతల కాశి, పీడీలు శ్రీనివాసరావు, వాసు, రాజు తదితరులు పాల్గొన్నారు.

పాందువ్వలో వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీల ధ్వంసం

ఉండి: మండలంలోని పాందువ్వ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం, క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలతో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీలను కొందరు గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి చించేశారు. దీనిపై ఆ పార్టీ సీనియర్ నాయకుడు, సోషల్ మీడియా మండల కో కన్వీనర్ గొంతే హరీష్ మండిపడ్డారు. ప్రజాభిమానం ఉన్న నాయకుడు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అని, ఫ్లెక్సీలు చించినంత మాత్రాన ఆయన గెలుపును అడ్డుకోలేరని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఇతర పార్టీల ఫ్లెక్సీలు భద్రంగానే ఉంచుకుని వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీలను మాత్రం చించివేయడం చూస్తుంటే వైఎస్సార్ సీపీ నాయకులను చూసి భయపడుతున్నారని అర్థం అవుతుందన్నారు. త్వరలో జరిగే సాధారణ ఎన్నికల్లో ఉండిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురుతుందనే భయం వారిని వెంటాడుతుందన్నారు. సామరస్యంగా గ్రామంలో అన్ని పార్టీల వారు వారి ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకుంటే వైఎస్సార్ సీపీకి చెందినవి మాత్రమే చించివేసి, ముఖాలు కోసిన తీరు చూస్తుంటే వైఎస్సార్ సీపీ జెండాకు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనకు వారెంత భయపడుతున్నారో అర్థం చేసుకోవచ్చునని అన్నారు. ఎవరు ఎన్ని చేసినా అటు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయాన్ని, ఇటు ఉండిలో పీవీఎల్ నర్సింహరాజు గెలుపును ఎవ్వరూ అడ్డుకోలేరని అన్నారు. ఫ్లెక్సీలు చించివేసిన వారిపై కఠిన చర్యలు తీసుకునేలే డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు దృష్టికి తీసుకువెళతామని ఈ సందర్భంగా హరీష్ తెలిపారు. అలాగే ఈ ఘటనపై స్పందించిన వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు మాట్లాడుతూ ఈ విషయాన్ని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు దృష్టికి తీసుకువెళ్ళామని ఫ్లెక్సీలు చించివేసిన వారు ఎవరైనా వారిపై చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు ముందుకు వెళుతున్నామని ఆయన తెలిపారు.


ఫ్లెక్సీలు చించేసిన దృశ్యం

జీఆర్‌డీపీ అభివృద్ధిపై సదస్సు


అవగాహన కల్పిస్తున్న అధికారి

ఉండి: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక(జీఆర్‌డీపీ)పై గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులకు అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి రాబోతున్న నిధుల వివరాలు, వాటితో గ్రామాల్లో చేపట్టబోయే అభివృద్ధి పనులపై ప్రణాళిక రూపొందించే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. 15వ ఆర్థిక సంఘం నుంచి గ్రామాలకు రాబోతున్న నిధులు, వాటితో చేపట్టాల్సిన పనుల గుర్తింపు తదితర విషయాలపై మాట్లాడారు. అలాగే గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజల భాగస్వామ్యంతో ఏ విధంగా పరిష్కరించాలనే అంశాలను మాస్టర్ ఆఫ్ ట్రైనర్ ఎస్.శంకరం వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.రవీంద్ర, ఈవోపీఆర్డీ కె.కొండలరావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉండి ఎంపీడీవోగా రవీంద్ర


బాధ్యతలు చేపట్టిన రవీంద్రకు స్వాగతం పలుకుతున్న అధికారులు

ఉండి: ఉండి నూతన ఎంపీడీవోగా ఎస్.రవీంద్ర గురువారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం డ్వామా ఏపీడీగా పనిస్తున్న ఆయనను ప్రభుత్వం ఉండి ఎంపీడీవోగా నియమించింది. బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవోకు మండల సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. గతంలో ఉండి ఎంపీడీవోగా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించిన ఈవోపీఆర్డీ తిరిగి తన బాధ్యతల్లోకి వెళ్ళారు. ఈ సందర్భంగా నూతన ఎంపీడీవో మాట్లాడుతూ మండల పరిషత్ కార్యాలయ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ అధికారులను సమన్వయ చేసుకుంటూ మండలాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కొండలరావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మను దర్శించుకున్న పీవీఎల్ నర్సింహరాజు


ఉణుదుర్రులో అమ్మవారిని దర్శించుకుంటున్న పీవీఎల్ నర్సింహరాజు

ఉండి: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలోని ఉణుదుర్రులో వేంచేసి యున్న ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు నిర్వహించారు. గురువారం జాతర ముగింపు ఉత్సవానికి డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహకులు ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. నియోజకవర్గ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారికి పూజలు చేసినట్లు పీవీఎల్ తెలిపారు. గ్రామంలోని భక్తులతో పాటు యండగండి, పాందువ్వ, మైప, ఉప్పులూరు, ఆరేడు, కోలమూరు గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున విచ్చేసి అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు కూనపరాజు వర్మ, సర్పంచ్ పిన్నంరాజు నాగలక్ష్మి, ఎంపీటీసీ అల్లూరి మాధవి, దాట్ల కామరాజు, పైలా సత్యనారాయణ, జి.సుందర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


కోపల్లె హైస్కూల్‌లో కలుసుకున్న 2002-03 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

కాళ్ల: సుమారు 21 ఏళ్ళ క్రితం 10వ తరగతి చదువుకున్న విద్యార్థుల కలయికకు కోపల్లె హైస్కూల్ వేదికైంది. 2002 – 03 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు గురువారం ఒకచోట కలిశారు. స్నేహబంధం ఎంత మధురమో అంటూ విద్యార్థులు అంతా ఓ చోట కలిసి పాత జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. ఆత్మీయ పలకరింపులతో యోగక్షేమాలు తెలుసుకుంటూ ఆనందంగా గడిపారు. తమ పిల్లలు, కుటుంబ సభ్యులతో పూర్వ విద్యార్థులు హాజరవడంతో పాఠశాల ప్రాంగణం అంతా పూర్వ విద్యార్థుల కుటుంబ సభ్యులతో నిండిపోయింది. వివిధ వృత్తులు, ఉద్యోగ, వ్యాపారాల్లో స్థిరపడి పలు ప్రాంతాల్లో ఉన్న వారంతా ప్రస్తుత బిజీ షెడ్యూల్లో కూడా స్నేహబంధమే ముఖ్యమంటూ ఓ చోట కలిసి ఉదయం నుంచి సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేద్దామంటూ, తోటి విద్యార్థులకు ఉపయోగపడతామంటూ తీర్మానాలు చేసుకున్నారు. పూర్వ విద్యార్థులంతా తమ వయస్సును సైతం పక్కన పెట్టి వినోద కార్యక్రమాల్లో పాల్గొని గీతాలాపన చేస్తూ పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. మరొకసారి కలుద్దాం అంటూ ఒకరికొకరు ఆత్మీయ వీడ్కోలు చెప్పుకున్నారు. ఆత్మీయ కలయికకు కృషి చేసిన స్నేహితులను తోటి విద్యార్థులు అభినందించారు.

అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలి


పోడూరులో మాట్లాడుతున్న ఎస్‌టీవీ రాజేశ్వరరావు

పోడూరు: బీఎల్‌ఓలు, బూత్ అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆచంట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్‌టీవీ రాజేశ్వరరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఎన్నికల విధులపై బీఎల్‌ఓలకు, బూత్ అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో రిటర్నింగ్ అధికారి రాజేశ్వరరావు మాట్లాడుతూ బూత్ స్థాయి అధికారులు, బీఎల్‌ఓలు ఎన్నికలకు సంబంధించి చేయాల్సిన విధులను వివరించారు. విధుల్లో అలసత్వం వహించకుండా జవాబుదారీతనంగా పని చేయాలని సిబ్బందికి ఆదేశించారు. బీఎల్‌ఓలు ఓటరు జాబితాను ఒకటి రెండుసార్లు సరి చూసి లోపాలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సదస్సులో స్థానిక తహసీల్దార్ ఆర్‌వీ కృష్ణారావు, ఆర్‌ఐలు కె.రాంబాబు, ఎస్.త్రిమూర్తులు, డిప్యూటీ తహసీల్దార్ డి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అంబేడ్కర్ ఆశయాలను అనుసరించాలి


భీమవరం డీఎన్నార్ కళాశాల ఆవరణలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం: స్థానిక డీఎన్నార్ కళాశాలలో గురువారం సామాజిక సమతా సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో అంబేడ్కర్ ఆశయాలు, లక్ష్యాలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ బీఎస్ శాంతకుమారి మాట్లాడుతూ విజయవాడలోని స్వరాజ్ మైదానంలో శుక్రవారం 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రభుత్వం ఆధ్వర్యాన ఆవిష్కరిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఘనంగా ముత్యాలమ్మ జాతర

మొగల్తూరు: స్థానిక నడివీధి ముత్యాలమ్మ జాతరను బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా సంక్రాంతి పండుగను పురస్కరించుకుని అమ్మవారి జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. బుధవారం రాత్రి నిర్వహించిన ఈ జాతరలో గ్రామస్తులతో పాటు బంధుమిత్రులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సహకరించాలి

నరసాపురం: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నరసాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా దానయ్యనాయుడు సూచించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని షాపులు, హోటళ్లలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. యజమానులతో మాట్లాడారు. 14 సంవత్సరాల లోపు బాల, బాలికలను పనిలో పెట్టుకోకూడదన్నారు. అలా చేస్తే చట్టరీత్యా శిక్షార్హులవుతారన్నారు. చిన్న పిల్లలను పనిలో పెట్టుకోమని వారి తల్లిదండ్రులు తీసుకొస్తే వారికి కౌన్సిలింగ్ ఇచ్చి పంపాలని చెప్పారు. పిల్లలను బడుల్లో చేర్పించడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌వార్డ్ లేబర్ ఆఫీసర్ కేబీఆర్ శర్మ, ఉచిత న్యాయవాదులు బళ్ల శ్రీహరి, నారిన శ్రీనివాసరావు, నక్కా ఆనందబాబు, కేసీహెచ్ పద్మజ పాల్గొన్నారు.

సంక్షేమం అందించడమే లక్ష్యం

పెనుగొండ: ప్రతి పేదవాడికీ సంక్షేమం అందించడమే ప్రధాని మోదీ లక్ష్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ అన్నారు. ఆచంట మండలం వల్లూరు గురువారం నిర్వహించిన భారత వికసిత్ సంకల్ప యాత్రలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ పథకాలు వివరించారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు ముచ్చర్ల నాగ సుబ్బారావు, ధార్మిక సెల్ కన్వీనరు హరి శివరామకృష్ణ, ఎంపీడీఓ నరసింహ ప్రసాద్, సర్పంచ్ నేలపూడి బేబీ తదితరులు పాల్గొన్నారు.